సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 30 । మే । 2024



మితిమీరిన వేగం.. తీస్తోంది ప్రాణం
రెప్పపాటు కాలంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. మితిమీరిన వేగమే ఇందుకు కారణం. ఐదునెలల్లో సుమారు వందమంది మృత్యువాత పడ్డారు. -8లో



కడప, నెల్లూరు జట్లు విజయం
కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో రెండో రోజున కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.2/29.2

జిల్లాలో బుధవారం 29.2 – 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ గురుకుల పాఠశాలలో 5,6 తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పెతకంశెట్టి సోమ సత్యశేఖర్ తెలిపారు. ముస్లిం మైనారిటీ, దూదేకుల విద్యార్థులు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు ఇవ్వాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 7780179446, 9059500173 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పది సప్లిమెంటరీ పరీక్షకు 1501 మంది హాజరు
కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన భౌతికశాస్త్ర పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 16 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 2286 మంది విద్యార్థులకు 1501 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు.

జూన్ 1 నుంచి ఓపెన్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు
కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదోతరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పబ్లిక్ పరీక్షలు జూన్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కే వీ సుబ్బారెడ్డిలు తెలిపారు.పదో తరగతికి సంబంధించి 5 కేంద్రాల్లో 768 మంది అభ్యాసకులు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 7 కేంద్రాల్లో 1373 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ రెండు పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. అభ్యాసకులు తమ హాల్‌టికెట్లను సంబంధిత అధ్యయన కేంద్రంలోని ఏ వన్ సమన్వయకర్త వద్ద నుంచి పొందాలని వారు పేర్కొన్నారు.

ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయులకు చార్జిమెమోలు
కడప ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కేటాయించిన ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయులకు పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనురాధలు చార్జిమెమోలను జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా 142 మంది ఉపాధ్యాయులు, ఏడుగురు ప్రధానోపాధ్యాయులకు ఈ చార్జిమెమోలను ఇచ్చారు. దీనిపై వారు నివేదికలను ఇవ్వనున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి వచ్చిన నివేదికలను ఒకటి, రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు క్రమశిక్షణా చర్యలను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతం
కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా బుధవారం వారం నిర్వహించిన ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో 37 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 7052 మంది విద్యార్థులకు 6705 మంది హాజరుకాగా 347 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 349 మందికి 326 మంది హాజరుకాగా 23 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 20 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 2114 మందికి 1995 మంది హాజరుకాగా 119 మంది గైర్హాజరయారు. ఒకేషనల్‌కు సంబంధించి 133 మందికి 128 మంది హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ ఆర్‌ఐవో బండి వెకంటసుబ్బయ్య తెలిపారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల కోసం మొత్తం 256 టేబుళ్ల ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడెంచల భద్రత
- 18 నుంచి 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- 112 సీసీ టీవీల ఏర్పాటు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు


కడప నగరంలోని ఓట్ల లెక్కింపు కేంద్రం

కడప సెవెన్‌రోడ్స్: లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. పోలింగ్ ముగిసిన 21 రోజుల తర్వాత కౌంటింగ్ జరుగుతోంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా చర్చలు, బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. జూన్ 1వ తేదీ సాయంత్రం 6 గంటల తర్వాత వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాల కోసం కూడా ఎదురు చూస్తున్నారు. వీటన్నింటికీ మంగళవారం తెరపడనుంది. ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న ఓటర్ల తీర్పు వెల్లడి కానుంది. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

- కడప నగర సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని లోక్‌సభతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు 18 నుంచి 23 రౌండ్ల మధ్య జరుగుతుంది. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. అరగంట తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ పూర్తి కాకుండా ఈవీఎంల కౌంటింగ్ పూర్తి చేయరు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు వీలుగా జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే దాదాపు ఏర్పాట్లు పూర్తి చేసింది. లోక్‌సభ, ఏడు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపునకు సంబంధించి మొత్తం 256 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ఈవీఎం టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ వద్ద ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ లెక్కింపు వద్ద 10 టేబుల్స్‌కు ఒక ఏఆర్ఓ, సీఎస్, సీఏ చొప్పున ఉంటారు. మొత్తం 130 శాతం రిక్వైర్‌మెంట్ మేరకు 293 కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 374 కౌంటింగ్ అసిస్టెంట్లు, 368 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఈనెల 25న కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. జూన్ 2వ తేదీ రెండో విడత ర్యాండమైజేషన్ జరగనుంది. కౌంటింగ్ రోజు ఉదయం 5 గంటలకు మూడోవిడత ర్యాండమైజేషన్ పూర్తి చేసి సిబ్బందికి కౌంటింగ్ టేబుళ్లను కేటాయించనున్నారు. జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు వీలుగా 112 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, కారియార్స్‌ను కవర్ చేసే విధంగా ఇవి ఉంటాయి. కౌంటింగ్ హాళ్లలోని ఈవీఎంలకు సంబంధించిన కదలికలను డిస్‌ప్లే చేసే విధంగా అమర్చారు. ఈటీపీబీఎస్ స్కానింగ్ కోసం సరిపడే క్యూఆర్ కోడ్ రీడర్స్‌ను సిద్ధంగా ఉంచారు. సరిపడు కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, యూపీఎస్, స్టేషనరీ, టెలిఫోన్, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ హాల్స్‌కు కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను ఎలాంటి అంతరాయం లేకుండా తీసుకు వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక బారికేడ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో నమోదైన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	శాతం
బద్వేలు	1,72,660	78.74
కడప	1,85,079	65.27
పులివెందుల	1,86,834	81.34
కమలాపురం	1,72,401	84.44
జమ్మలమడుగు	2,10,241	86.68
ప్రొద్దుటూరు	1,97,349	79.59
మైదుకూరు	1,79,692	84.82

మూడంచెల భద్రతా వ్యవస్థ
కౌంటింగ్ జరిగే ప్రదేశంలోకి అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించకుండా మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. కౌంటింగ్ సెంటర్ చుట్టూ వంద మీటర్ల పరిధిలో మొదటి రక్షణ వలయం ఉంటుంది. ఈ పరిధిలోకి ఎలాంటి వాహనాలను అనుమతించబోరు. ఈ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద స్థానిక పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ అధికారుల గుర్తింపును ఇక్కడ పరిశీలిస్తారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా జిల్లా ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫోటో ఐడీ కార్డు, మీడియా పాసులను పరిశీలించాకే కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఇక్కడ ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారి ఉంటారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి ప్రవేశించే ద్వారం వద్ద రెండో భద్రతావలయం ఉంటుంది. రాష్ట్ర పోలీసులు ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అగ్గిపెట్టెలు, ఆయుధాలు, మొబైల్ ఫోన్లు, ఐ ప్యాడ్స్, ఇతర ఎలక్ట్రానిక్ డివైజెస్ వంటికి లోనికి తీసుకు వెళ్లకుండా ఇక్కడే నిలువరిస్తారు. ఇవన్నీ అక్కడ ఏర్పాటు చేసిన మీడియా రూములో భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో అనుమతించిన గదుల్లో మాత్రమే ఫోన్‌లో మాట్లాడుకునే సౌలభ్యం ఉంటుంది. కౌంటింగ్ హాలులోకి ప్రవేశించే ద్వారం వద్ద మూడో భద్రతా వ్యవస్థ ఉంటుంది. కేంద్ర సాయుధ బలగాలు ఇక్కడ ఉంటాయి. వీరు కూడా తనిఖీలు నిర్వహించిన తర్వాతే కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు.



ఏసీఏ జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ నియామకం


విజయ్‌కుమార్

కడప స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024–25 సీజన్‌కు సంబంధించి జూనియర్ క్రికెట్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ జిల్లాకు చెందిన పైడికాల్వ విజయ్‌కుమార్‌ను నియమించారు. నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి జారీచేశారు. ఈ నియామకం ఏడాది పాటు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా పైడికాల్వ విజయ్‌కుమార్ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ పరిధిలో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్‌గా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్


ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా 27001 నుంచి 43 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 137 మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కౌన్సెలింగ్‌కు ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. గురువారం 43001 నుంచి 59000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు, ర్యాంకుల పరిశీలన ఉంటుందని జ్యోతి తెలిపారు.

టీడీపీ శిబిరంలో ఉత్కంఠ!

- అతి విశ్వాసం దెబ్బతీసిందంటున్న శ్రేణులు
- కడప, కమలాపురం, మైదుకూరులో సెల్ఫ్ గోల్
- మరోమారు ఓటమి తప్పదంటున్న పుట్టా, పుత్తా వర్గీయులు



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాసేవ, విశ్వసనీయత ఇవన్నీ ఒక ఎత్తయితే, ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్, సమీకరణలు మరో ఎత్తు. వర్గ రాజకీయాలకు పేరున్న రాయలసీమ.. అందులో కడప జిల్లాలో ఆ పాళ్లు మరింత ఎక్కువ. ఇలాంటి వర్గ సమీకరణలో టీడీపీ శిబిరం విఫలమైంది. మరోవైపు గెలుపు తథ్యమని అతి విశ్వాసంతో ఉన్న అవకాశాన్ని చేజార్చుకున్నారు. కడప, కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితి తెరపైకి వచ్చింది. దీంతో పోలింగ్ అనంతరం తెలుగుదేశం శిబిరంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

- కడప, రాజంపేట పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఆధిపత్యం ఎక్కువ. ఎన్నికలు ఏవైనా ఏకపక్షంగా ఫలితాలు ఉండేవి. ఇప్పటికీ వైఎస్సార్‌సీపీకి ప్రజానీకం అండగా ఉన్నప్పటికీ ఈమారు కొన్ని ప్రాంతాల్లో కాస్త తేడా కన్పించింది. అందుకు కారణంగా ఆయా నేతల వ్యక్తిగత వ్యవహారశైలి, మరోవైపు టీడీపీ అభ్యర్థులు వరుసగా ఓటమి పాలవుతున్న నేపథ్యం, సామాజిక సమీకరణలు ఇలాంటి కారణాల రీత్యా కాస్త అనుకూల పవనాలు కన్పించాయి. కాగా, టీడీపీ అభ్యర్థులు ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రావాల్సి ఉండగా, తిరోగమనంలో ఉన్న అవకాశాన్ని చేజార్చుకుంటూ వచ్చారని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఓటమికి కారణమవుతున్న అతి విశ్వాసం..
కడప అసెంబ్లీ పరిధిలో ఎన్నడూ లేనివిధంగా విద్వేషాలు తెరపైకి వచ్చాయి. ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్న ప్రజానీకం మధ్యలో కలతలు సృష్టించారు. ఎన్నికల కోసం హిందూ–ముస్లిం ఫీలింగ్ తీసుకొచ్చారు. ఎలాగైనా గెలుస్తామన్నా ధీమా టీడీపీ శిబిరంలోకి వచ్చి చేరింది. ఈ పరిస్థితుల్లో టీడీపీ టికెట్ ఆశించిన కార్పొరేటర్ ఉమాదేవి కుటుంబ మద్దతు స్వీకరించడంలో విఫలమయ్యారు. మరోవైపు శాంతికి నిలయమైన కడపలో దుందుడుకు చర్యలను కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పుడే ఇలా ఉంటే, ఎమ్మెల్యేగా ఎన్నికైతే పరిస్థితి ఎలా ఉంటుందోనన్న అంచనాకు తటస్థులు వచ్చారు. అదే టీడీపీకి శాపంగా మారిందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగుతున్న అంజద్‌బాషా మంచితనాన్ని గమనించిన ప్రజలు పోలింగ్‌లో ఆ ప్రభావం చూపారని పలువురు వివరిస్తున్నారు. ఇలాంటి స్థితి కమలాపురంలో కూడా తెరపైకి వచ్చింది. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అయినప్పటికీ స్థానికంగా ఆయన మద్దతు కోరలేదు, స్వగ్రామం కోగటంలో ప్రచారానికి వెళ్తూ, సమాచారం కూడా ఇవ్వలేదు. పైగా అవసరం లేదన్నట్లుగా టీడీపీ అభ్యర్థి పుత్తా కుటుంబం వ్యవహరించింది. మరోవైపు టీడీపీ నేత సాయినాథశర్మతో ఎన్నికలు సమీపించే కొద్దీ గొడవలు పెట్టుకొని దూరం చేసుకున్నారు. ఈ ఇద్దరు నేతలను దూరం చేసుకోవడం టీడీపీకి ప్రతిబంధకంగా మారిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈనేపథ్యంలో భారీ మెజార్టీ దక్కుతుందని భావిస్తున్న కమలాపురం మండలంలో టీడీపీకి ఊహించని స్థాయిలో లోటు ఏర్పడిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

స్వయంకృతాపరాధమే..
మైదుకూరులో టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ రెండుసార్లు వరుసగా ఓడిపోయారు. ఈమారు కొంత సానుభూతి వ్యక్తమైంది. ఇలాంటి స్థితిలో అనుకూలంగా మల్చుకోవాల్సి ఉండగా చేజార్చుకుంటూ వచ్చారని పలువురు వివరిస్తున్నారు. ముందే యాదవ ముద్ర వేసుకొని రెడ్డి సామాజిక వర్గాన్ని దూరం చేసుకున్నారనే అపప్రద ఉంది. కాగా.. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కుటుంబాన్ని పొగబెట్టి బయటికి పంపించారు. దీంతో ఆ సామాజిక వర్గం ఆవేదనతో రగిలిపోయింది. ఉన్న ఒక్క నాయకున్ని కూడా నిలుపుకోలేదనే భావన వ్యక్తమైంది. ఎస్సీ, ముస్లిం మైనార్టీ వర్గీయులు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారు. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్.రఘురామిరెడ్డి విజయం సునాయసమైందని విశ్లేషకుల భావన. గట్టి పోటీ ఇవ్వగలమని భావించినా ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ వెనుకంజలో పడింది. మరోమారు ఓటమి తప్పదని పుట్టా, పుత్తా వర్గీయులు భావిస్తూనే, పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలా ఆయా నియోజకవర్గాల్లో ఓవర్ కాన్ఫిడెన్స్‌తో సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో కౌంటింగ్ సమీపించే కొద్దీ టీడీపీ శిబిరంలో తీవ్ర ఉత్కంఠ నెలకొనడం గమనార్హం.

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు
జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు



కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టామని, కౌంటింగ్ కోసం అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుంచి సార్వత్రిక ఎన్నికలు – 2024 కౌంటింగ్ సన్నద్ధతపై అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి, త్వరితగతిన కచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు, జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, జేసీ గణేష్ కుమార్, కడప నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్ చంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేపట్టామని పేర్కొన్నారు. కడప నగర పరిధిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లపై అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి పూర్తిగా తెలియజేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అన్నిరకాల భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యాక ఈవీఎంల సీలింగ్ కోసం ఏర్పాట్లు చేపట్టామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను 4 గంటలలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కూడా రెండు విడతలుగా ఇస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు విజయవంతంగా నిర్వహించేందుకోసం సెక్టోరియల్ అధికారుల నియామకం, సీసీటీవీల ఏర్పాటు, 133, 144 సెక్షన్‌లను అమలు చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి హింస జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొబైల్ పికెట్స్, మొబైల్ పార్టీలను, నైట్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని, గొడవలు చేసేవారిని, రౌడీషీటర్లను గుర్తించి బైండోవర్ చేశామన్నారు. జిల్లా అంతటా 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ సంబంధిత ఆర్‌ఓలతో కౌంటింగ్ సన్నద్ధతపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో గంగాధర్ గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మధుసూదన్, వెంకటరమణ, కౌసర్ బాను, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ కార్యాచరణ అమలుకు సమాయత్తం కావాలి
జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఖరీఫ్‌కు ఏడీఏలు, ఏవోలు ఖరీఫ్ కార్యాచరణ అమలుకు సమాయత్తం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని ఏడీఏలు, ఏవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆశాజనకంగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొందన్నారు. దీనికి అనుగుణంగా మనం కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే సబ్సిడీ విత్తనాలను మంజూరు చేసిందన్నారు. దీంతోపాటు ఎరువులు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే వేరుశనగ కాయలు కూడా మంజూరయ్యాయన్నారు. వీటన్నింటిని రైతులకు సక్రమంగా అందించాలని సూచించారు. విత్తనాల పంపిణీలో ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా అన్ని జాగ్రత్తలను తీసుకోవాలని తెలిపారు. ఏడీఏలు, వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి వారికి పంటలసాగుకు అవసరమైన సలహాలు, సూచనలను అందించి సహకరించాలని చెప్పారు. ఏడీఏలు, వ్యవసాయ అధికారులు డీఏఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా నాయకులకు బహిష్కరణ నోటీసులు
కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రౌడీషీట్, సస్పెక్ట్ షీట్స్ కలిగిన వారికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో బహిష్కరణ నోటీసులను సిద్ధం చేశారు. ఈ నోటీసులను ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని రాజకీయ ప్రతినిధులకు, కార్యకర్తల్లో కొందరికి ఆయా పోలీసు అధికారులు, సిబ్బంది ద్వారా అందచేసినట్లు సమాచారం. రానున్న రెండు రోజుల్లో మిగతా వారికి కూడా నోటీసులను అందజేయనున్నారు. జూన్ 1 వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు వారు జిల్లా కేంద్రానికి రాకూడదని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కాకుండా మిగిలిన ప్రజాప్రతినిధుల్లో కొందరికి నోటీసులు అందించనున్నారు.

క్లుప్తంగా

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు

కమలాపురం : పట్టణ పరిధిలోని పాపాఘ్ని నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో దాడులు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్లను ఎస్‌ఈబీ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

సోమశిల : అనంతసాగరం మండలం సోమశిల జలాశయం ప్రాంతంలో ఓ వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. ఎస్సై సుబ్బారావు కథనం మేరకు.. సోమశిల శివాలయం వంతెన సమీపంలో వృద్ధురాలి మృత దేహం నీటిపై తేలుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె పర్సులో ఆధార్ కార్డు లభ్యమైంది. దాని ఆధారంగా వైఎస్సార్ జిల్లా నరసాపురం మండలం బాలరాజుపల్లికి చెందిన పంగా అంకన్న గారి చెన్నమ్మ (74)గా గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేక ప్రమాదవశాత్తూ జారి పడిందా అని తెలుసుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. దుబ్బిగానిపల్లెకు చెందిన చంద్రశేఖర్ భార్య భార్గవి(23) ఆరు నెలల గర్భిణి. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



స్కూటీ బొలెరోలు ఢీకొన్న దృశ్యం (ఇన్‌సెట్) సహీనా(ఫైల్)

చిన్నమండెం : మండలంలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ సహీనా(53) మృతి చెందినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. మదనపల్లి నుంచి సద్దలగుట్టపల్లికి స్కూటీలో సహీనా, ఆమె కుమార్తె సబీన్‌తాజ, మనుమడు అబ్దుల్‌రెహమాన్ వెళ్తున్నారు. బెంగళూరు నుంచి రాయచోటికి వస్తున్న బొలెరో వాహనం స్కూటీని ఢీకొనడంతో కిందపడి సహీనాకు తీవ్ర గాయాలయ్యాయి. రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెప్పపాటు కాలంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. గంటకు 80–100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయడమే ఇందుకు కారణం. వేగాన్ని నియంత్రించలేక.. వాహనాలను అదుపు చేయలేక డివైడర్లు, ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ గ్రామీణ రహదారుల్లో అతివేగంతో నిత్యం ఐదారు ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని దుర్ఘటనల్లో వాహన చోదకులు ప్రాణాలు కోల్పోయి కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. 18–60 ఏళ్ల మధ్య వారే అత్యధికం.

మితిమీరిన వేగం..

తీస్తోంది ప్రాణం



ఇటీవల గువ్వల చెరువు ఘాట్‌లో ఢీ కొన్న లారీలు



- చిన్నమండెం మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవగుడిపల్లె హరిజనవాడకు చెందిన నరసింహులు(35) మృతి చెందారు. స్థానిక గురు హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై నిలిపిన లారీని ఢీకొనడంతో గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.
- మదనపల్లె మండలం బురకాయలకోటకు చెందిన సాహెబ్ పీర్, హఫీజుల్లాతో కలిసి వివాహ శుభలేఖలు పంచేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వలసపల్లె పరిధిలోని నయారా పెట్రోల్ బంక్ వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరితోపాటు మరో వాహనంలో వస్తున్న రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

- నిత్యం నెత్తురోడుతున్న రాష్ట్ర రహదారులు
- ఇంకొకరి నిర్లక్ష్యం... మరొకరికి ప్రాణ సంకటం
- ఐదు నెలల్లో వంద మందికిపైగా మృత్యువాత

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా వ్యాప్తంగా ఐదు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసున్నాయి. సుమారు వందమంది మృత్యువాత పడగా 233 మంది క్షతగాత్రులయ్యారు. వాహనదారులు వేగం నియంత్రణ చేయలేకపోవడం, రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు ఆచరణ పెట్టకపోవడమే ఇందుకు కారణం. మదనపల్లి, యర్రగుంట్ల, కేవీ.పల్లె, కురలబలకోట.. తదితర ప్రాంతాల్లో మితిమీరిన వేగం, మద్యం మత్తు, ఓవర్ టేక్, ఆకస్మాత్తుగా వాహనం నిలపడం, పరిమితికి మించి ప్రయాణం, రోడ్లకు అనుకొని, చెట్ల కింద ఆపడం వంటి కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. కొన్ని చోట్ల లారీలను హోటళ్లు, డాబాలు, ఇతర దుకాణాల వద్ద హైవేకు అనుకొని నిలిపివేస్తున్నారు. వెనుక వచ్చే వాహనాలు వేగాన్ని నియంత్రించలేక వాటిని ఢీకొంటున్నాయి. క్లీనర్‌గా పనిచేసే వారు అప్పుడప్పుడూ వాహనాలు నడపడం, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక పట్టుకోల్పోయి ప్రమాదాలకు కాణమవడం జరుగుతోంది. ఫలితంగా ఎక్కువ మంది క్షతగాత్రులవుతున్నారు.

తీర్మానం చేసినా...

ఉమ్మడి జిల్లాలో ప్రమాదాలు జరిగే 70 బ్లాక్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక డ్రమ్ములు, బ్యారికేడ్లు, రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని రోడ్ సేఫ్టీ సమావేశాల్లో తీర్మానించారు. అది కార్యరూపం దాల్చినా.. కేవలం ఒకటి రెండు చోట్లకే పరిమితమైంది. అనంతరం అధికారులు అటు వైపు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉంది. వాహన డ్రైవర్లను మేలుకొల్పేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని ప్రారంభించినపుడు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. అయితే కాలక్రమేణా ఆ కార్యక్రమానికి బ్రేక్ పడింది.

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 మే వరకు	214	100	233

ఇలా చేస్తే.. ప్రమాదాలకు చెక్

జాతీయ రహదారి వెంబడి ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చూడాలి. రాత్రి వేళల్లో వాహన చోదకునికి ముందు వాహనం ఉందనే విషయాన్ని స్పష్టంగా కనిపించేలా చేయాలి. వేగ నియంత్రణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా చూడాలి. అతి వేగంతో దూసుకెళ్తున్న వాహనాలపై నిఘా కెమెరాలతో క్లోం వేయాలి. సంబంధిత వాహన యజమాని సెల్‌ఫోన్‌కు సందేశం పంపి అప్రమత్తం చేయాలి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించేలా చూడాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి. అనుభవం లేని డ్రైవర్లు నడపుతుంటే వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో సీట్ బెల్ట్ ధరించేలా చూడాలి. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలి.

ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తాం



రోడ్డు నియమ నిబంధలను ఉల్లంఘిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేస్తాం. వాహనాల వేగ నియంత్రణను అరికట్టేందుకు స్పీడ్ లేజర్ గన్‌తో తనిఖీలు చేపడుతున్నాం. మద్యం మత్తుల్లో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

గండిలో హనుమజ్జయంతి వేడుక



హనుమజ్జయంతి వేడుక ప్రారంభిస్తున్న పురోహితులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుక బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు అనుజ్ఞ, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధన ధారణ, వాస్తు హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా.. చెన్నకేశవుని రథోత్సవం



రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో లంకరించారు. లోక కళ్యాణార్థం గణపతి, నవగ్రహ, శాంతి హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణ మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కౌంటింగ్‌కు.. పోలీస్ పద్మవ్యూహం!

- కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్
- జూన్ 3న ఇతర ప్రాంతాల వారు వుండరాదు
- ఆర్టీసీ బస్సులు నగర శివారు వరకే పరిమితం
- రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసుల నమోదు
- ర్యాలీలు, బహిరంగసభలకు అనుమతి లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున(జూన్ 4)న కడప నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ×పోలీస్ పద్మ వ్యూహం×లాంటి రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని కడప డీఎస్పీ ఎం.డి.షరీఫ్ తెలిపారు. కడప పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 3న మధ్యాహ్నం నుంచే కడప నగరంలోకి బయటి ప్రాంతాల వారు రాకూడదన్నారు. వివిధ రాజకీయపార్టీల అభ్యర్థులు, తమ ఏజెంట్లు, సహచరులు కడప హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో బస చేయాలంటే కలెక్టర్, ఎస్పీ అనుమతి ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి నాలుగు అంచెల భద్రత కల్పిస్తామన్నారు.

ఆ దారిలోనే అనుమతి

కడప నగర శివారులోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను)లో ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల కేంద్రానికి వచ్చే వారి కోసం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. రాయచోటి రింగ్ రోడ్డు నుంచి రిమ్స్, మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్‌కు వెళ్లే దారుల్లో వచ్చే వారిని జకరయ్య మిల్లు వద్ద నుంచి కౌంటింగ్ కేంద్రానికి, జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం నుంచి పాలకొండల రింగ్ రోడ్డు నుంచి కౌంటింగ్ కేంద్రానికి అనుతిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులు అనుమతి పత్రాలతో రావాల్సిందేనన్నారు. వాహనాలను కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపే అనుమతిస్తామని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ప్రజల కోసం తాత్కాలిక సహాయ శిబిరాలు ఏర్పాటు చేశామని, అక్కడి నుంచే నగరంలోకి రావాల్సి ఉంటుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వున్న వారిని అనుమతిస్తామన్నారు.

శాంతి భద్రతలపై నిఘా

కడప నగరం, సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలపై నిఘా ఉంచామని డీఎస్పీ వెల్లడించారు. అల్లర్లకు పాల్పడే వారిపై కేసులను నమోదు చేసి, నలుగురిపై రౌడీ షీట్లు తెరిచామని పేర్కొన్నారు. కౌంటింగ్ రోజున ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు బస్సులు, భారీ వాహనాలను నగరంలోకి అనుమతించేది లేదన్నారు. నగరంలోకి వచ్చే ఏడు రహదారుల్లోనూ చెక్ పోస్టులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆర్టీసి బస్సులు చెక్ పోస్టుల నుంచే తిరిగి కేటాయించిన ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేయాలన్నారు. ఏ రాజకీయ పార్టీల వారైనా, సామాజిక మాధ్యమాల్లో బాధ్యతగా ఉండాలని, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా, వీడియో, ఆడియో ప్రచారాలు చేసినా వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

కడప నగరం, సబ్ డివిజన్ ప్రాంతాల పరిధిలో ఇప్పటికే సెక్షన్ 144 అమలులో ఉందని, తాజాగా 30 పోలీస్ యాక్ట్ జూన్ 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీ, బహిరంగ సభలు నిర్వహించరాదన్నారు. 6వ తేదీ నుంచి పోలీసుల అనుమతులు తీసుకుని వేడుక నిర్వహించుకోవచ్చన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన విధంగానే, కౌంటింగ్ ప్రక్రియలోనూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎరక్క.. డబ్బాలో ఇరుక్కుపోయి



బద్వేల్ పట్టణం అశోక్ నగర్‌లో ఓ వీధి కుక్క ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలో ఏదో తిందామని తలపెట్టింది. తన తల అందులో పట్టదని ఎరక్క.. ఇలా డబ్బాలో ఇరుక్కుపోయింది. కంగారు పడిన కుక్క దారిలో అటు ఇటూ తిరుగుతూ వదిలించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేసింది. చివరకు కొందరు యువకులు కుక్క తల నుంచి డబ్బా వేరుచేయడంతో బతుకుజీవుడా అంటూ ఉడాయించింది.

– బద్వేలు అర్బన్

కడప, నెల్లూరు జట్ల విజయం



తలపడుతున్న కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లా సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో రెండో రోజున కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. బుధవారం కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 310 పరుగులు చేసింది. టి.వంశీకృష్ణ 93 బంతుల్లో 83 పరుగులు, ఎస్.జహీర్‌అబ్బాస్ 31 బంతుల్లో 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు 46.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అవడంతో కడప జట్టు 63 పరుగుల తేడాతో విజయం సాధించింది.

8 వికెట్ల తేడాతో నెల్లూరు..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 42.5 ఓవర్లలో 161 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టు లోని యూఎంఎస్ గిరినాథ్ 44 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 21.5 ఓవర్లలో 165 పరుగులు చేసి విజయం సాధించింది. కె. రేవంత్‌కుమార్ 63 బంతుల్లో 81 పరుగులు చేశాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 55 బంతుల్లో 61 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



వంశీకృష్ణ, కడప (83 పరుగులు)



రేవంత్‌కుమార్, నెల్లూరు (81 పరుగులు)

రాచపల్లె రామమూర్తిరెడ్డి మృతికి సంతాపం



కడప ఎడ్యుకేషన్ : విద్యా మందిర్ స్కూల్ మాజీ కరస్పాండెంట్, ఆఫీసర్స్ క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ రాచపల్లె రామమూర్తిరెడ్డి(101) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన వయసు 101 సంవత్సరాలు. చెన్నూరు మండలం రామనపల్లె గ్రామానికి చెందిన ఈయన చక్కెర, సిమెంటు పరిశ్రమలకు ఎండీగా పనిచేశారు. జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ఆయన మృతి గురించి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ఆయన స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు. ఆయన కుమారుడు శివానందరెడ్డి, విద్యా మందిర్ స్కూల్ కరస్పాండెంట్ హరికుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీవాణి, కృష్ణారెడ్డి, నగర ప్రముఖులు, తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. సాయంత్రం రామనపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



పసుపులేటి శంకర్

నందలూరు : తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నందలూరుకు చెందిన డాక్టర్ పసుపు లేటి శంకర్ పేరు నమోదైనట్లు హైదరాబాద్‌కు చెందిన కళానిలయం సాంస్కృతిక సేవా విభాగం నుంచి ఆహ్వానం అందింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 30న హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయగానసభలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారం అందించనున్నారు. శంకర్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడి నివారణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, జాతీయ సమైక్యతతోపాటు ధార్మిక ఉపన్యాసాలు ఇస్తారు. ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడిగా, వైఎస్సార్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా, కడప రాజేశ్వరీ బీపీఆర్ భగవద్గీత సత్సంగం గౌరవాధ్యక్షుడిగా శంకర్ పనిచేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లి గ్రామానికి చెందిన గువ్వల సుబ్బారెడ్డికి చెందిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేశారు. అందులో పరికరాలు దోచుకెళ్లారు. బాధిత రైతు గువ్వల సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు.. చింతకొమ్మదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.